


## మారుతి
# కొత్త కార్లు వచ్చేస్తున్నాయి..
### 2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

**మారుతి ఈ-విటారా:**

దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్లా బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

**నయా గ్రాండ్ విటారా**

కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు, ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి విధంగా డిజైన్ చేసింది.

**కొత్త బాలెనో**

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్‌స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, సింగిల్-ప్యాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

**అప్‌గ్రేడ్ బ్రెజ్జా**

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

## ఎలక్ట్రానిక్స్‌లో కోటి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.

## రిలయన్స్ చేతికి కార్కినోస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థయైన ఆర్‌ఎస్‌బీవీఎల్ ..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా కార్కినోస్‌ను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.375 కోట్లు. జూలై 24, 2020లో ప్రారంభమైన కార్కినోస్..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవల్లో భాగంగా రోగ నిర్ధారణ, నిర్వహణ, అలాగే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే టెక్నాలజీ సేవలను అందిస్తున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ టర్నోవర్ రూ.22 కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 60 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నది.

# పెట్టుబడులపై ఫార్ములా-ఈ ఎఫెక్ట్!

### ప్రభుత్వంతో ఒప్పందాలకు జంకుతున్న పారిశ్రామికవేత్తలు
### స్నేహపూర్వక వాతావరణం లేదంటున్న ఇండస్ట్రీ వర్గాలు
### కంగారు పడుతున్న అధికారులు.. భవిష్యత్తుపై ఆందోళన



హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ సర్కారు అవలంభిస్తున్న వైఖరితో పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ఫార్ములా-ఈ రేసు ఒప్పందంపై విచారణ చేపట్టడం, కేసులు నమోదు చేయడంతో అటు పెట్టుబడిదారులు, ఇటు అధికార వర్గాలు కలత చెందుతున్నాయి. రాష్ట్రంలో ఇక ఏమాత్రం పరిశ్రమకు స్నేహపూర్వక వాతావరణం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ వైఖరితో పరిశ్రమ భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇదీ సంగతి..**

సహజంగా రాష్ట్రాలు అమలు చేసే సరళీకృత విధానాలు, ప్రభుత్వాల పనితీరు, స్నేహపూర్వక వాతావరణం తదితర అంశాల ఆధారంగా పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాక నిశ్చింతగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, తదుపరి చర్యలు చేపట్టడం చేస్తారు. స్వతహాగానే ప్రభుత్వాలపై భరోసా ఉంటుంది కాబట్టి ధైర్యంగా వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తారు. అంతే కాదు, ప్రజాస్వామ్యంలో ఐదేండ్లకోసారి ప్రభుత్వాలు మారడం సహజ ప్రక్రియ. ఒక ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ఆ తదుపరి వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. దశాబ్దాలుగా ఇదే తరహా సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏదైనా పథకాన్ని కొనసాగించడం తదుపరి ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా అప్పటికే మొదలైన పనులను పూర్తిచేసిన తరువాతే వాటిని నిలిపివేస్తారు. ఒప్పందాలు మాత్రం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

**కేసులతో రచ్చ**

గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన స్నేహపూర్వక విధానాలకు ఆకర్షితులై ఎన్నో దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొని వ్యాపారాలు చేసేందుకు, పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకొచ్చాయి. అందులో ఫార్ములా-ఈ రేస్ కూడా ఒకటి. ఢిల్లీ, ముంబైకి సైతం దక్కని ఖ్యాతిని హైదరాబాద్‌కు సాధించాలనే సంకల్పంతోపాటు కాలుష్యరహిత రవాణాను ప్రోత్సహించే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ సర్కారు ఆనాడు కార్ రేస్‌ను నిర్వహించాలని నిర్ణయించి ఒప్పందం చేసుకున్నది. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఈ రేస్‌లను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్వాహకులు ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించారు. ఈ వ్యవహారం నడుస్తుండగానే అప్పటి మంత్రితోపాటు అధికారులపై కూడా ప్రభుత్వం కేసులు నమోదు చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది.

**ఆందోళన**

గతంలో అనేక కంపెనీలు ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు, ఇచ్చిన హామీలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని కంపెనీలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించగా, మరికొన్ని కంపెనీల వివిధ దశల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఫార్ములా-ఈ విషయంలో తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలతోపాటు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న కంపెనీల్లో ఆందోళన మొదలైంది. ఫార్మాసిటీ విషయంలోనూ ఇంచుమించు ఇలాగే జరిగింది. అన్ని అనుమతులూ వచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఫార్మాసిటీని రద్దు చేయడంతో అప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలు అయోమయంలో పడ్డాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదనే భావన సర్వత్రా కలుగుతున్నది. దీంతో ప్రభుత్వం తరపున ఒప్పందాలు చేసుకునేందుకు అధికారులు కూడా జంకుతున్నారు. ఇటీవల పలువురు ఐఏఎస్ అధికారులు సమావేశమై.. లిఖితపూర్వకంగా ఇస్తే తప్ప ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయరాదని నిర్ణయించినట్టు వార్తలు రావడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పరిశ్రమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# టెలికం సంస్థలకు ఇక్కట్లే!




న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారీఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు తారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్‌ఎన్‌ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

**శాట్కామ్‌ల ఎంట్రీతో..**

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ పోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

# ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు




న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.



మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నమస్కరిస్తున్న పీవో చిత్రమిశ్రా

## మృతులకు ఐటీడీఏ అధికారుల నివాళి

ఏటూరునాగారం, డిసెంబర్ 28 : స్థానిక ఐటీడీఏలో పనిచేస్తూ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందిన ఏపీవో భీంరావు, అటెండర్ లక్ష్మి చిత్రపటాలకు ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా శనివారం నివాళులర్పించారు. ఏపీవో భీంరావు, లక్ష్మిలు మృతి చెందడతో వారికి సంతాప కార్యక్రమాన్ని ఐటీడీఏ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇరువురి చిత్రపటాల వద్ద పూలు సమర్పించిన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఇన్‌చార్జి ఎస్డీసీ వెంకటేశ్, డీడీ పోచం, ఏటీడీవోలు క్షేత్రయ్య, రమాదేవి, ఏవో నాగసాగర్, ఎస్‌వో సురేశ్‌బాబు, మేనేజర్ శ్రీనివాస్, అక్కౌంట్సు మేనేజర్ నర్సింగారావు, తహసీల్దార్ జగదీశ్వర్, జేడీఎం కొండల్‌రావు, డీటీ అనీల్, ప్రోగ్రాం మేనేజర్ మహేందర్ పాల్గొన్నారు.



శిబిరం వద్ద మాట్లాడుతున్న పల్లె నాగరాజు

## సీఆర్టీలను రెగ్యులరైజ్ చేయాలి

ఏటూరునాగారం, డిసెంబర్ 28 : సీఆర్టీలకు కనీస వేతనం చెల్లించకపోవడం అన్యాయమని పీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు ఆరోపించారు. మండలకేంద్రంలోని ఐటీడీఏ సమీపంలో సీఆర్టీలు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని నాగరాజు సందర్శించి మాట్లాడారు. సీఆర్టీలు 20ఏళ్లుగా శ్రమ దోపిడీకి గురవుతున్నారని, కనీస వేతనం అమలు కాకపోవడం వల్ల మనో వేదనకు గురవుతున్నారని, వెంటనే రెగ్యూలర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు బీ రాజు, సభ్యులు సతీశ్, సీఆర్టీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొడెం రవీందర్, రాజు పాల్గొన్నారు.

## జీటీఎస్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో చీరెల పంపిణీ

వాజేడు, డిసెంబర్ 28 : మండలంలోని చెరుకూరు గ్రామంలో శనివారం జీటీఎస్‌ఎస్‌ఎస్ సంస్థ నిర్వాహకుల ఆధ్వర్యంలో 30మంది వితంతు మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఏరియా లీడర్ దామోదర్, శ్యామ్, ఇస్సాక్, స్టివెన్ పాల్గొన్నారు.



మహిళలకు చీరెలు ఇస్తున్న సంస్థ నిర్వాహకులు

# మూణ్నాళ్ల ముచ్చటగా 'కార్గో'

- ఏడాదిగా నిలిచిన సేవలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు

మహదేవపూర్, డిసెంబర్ 28 : టీజీఎస్ ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ సేవలు ముణ్నాళ్ల ముచ్చటగా మారాయి. 2019 సంవత్సరంలో ప్రజల సౌకర్యార్థం మండలకేంద్రంలోని బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్గో సేవలు యేడాది కాలంగా నిలిచిపోయాయి. వ్యాపారులు, దుకాణాదారులు, రైతులు, డీలర్లు, విద్యార్థులతో పాటు ప్రజలు కార్గోపై ఆధారపడి పురుగుల మందులు, నిత్యావసర వస్తులు, పుస్తకాలు, మెడిసిన్, ఇతర వ్యవసాయ అనుబంధ వస్తులు కార్గో ద్వారా చేరవేసేది. ఇతర ప్రాంతాలకు సరుకులకు పంపేది. అంతేకాకుండా ఆర్టీసీకి సైతం మంచి ఆదాయం సమకూరేది. గత ఏడాదిగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరంలో సేవలు అందుబాటులో ఉండడంతో తప్పనిసరి అక్కడికి వెళ్లాల్సి వస్తున్నది. ఈ ప్రాంతంలో కేవలం కాళేశ్వరం, భూపాలపల్లిలోనే కార్గో అందుబాటులో ఉందని, పార్శిల్ కోసం కాళేశ్వరానికి పోవాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా తిరిగి సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

**సేవలు లేక ఇబ్బదులు పడుతున్నం**



మహదేవపూర్‌లో గతంలో ఆర్టీసీ కార్గో సేవలు ఏర్పాటు చేసింల్రు. కొంత కాలం నడిపి తర్వాత మూత పెట్టింల్రు. దీంతో మాకు చాలా ఇబ్బందైంతాంది. ముందులు, వస్తువులు తీసువచ్చేందుకు కష్టమైతాంది. తప్పనిసరిగా పని బంద్ పెట్టి కాళేశ్వరం వెళ్లాల్సి వస్తున్నది. ఆర్టీసీ ఉన్నాతాధికారులు స్పందించి తిరిగి మహదేవపూర్‌లో ఆర్టీసీ కార్గో సేవలను పునరుద్ధరించాలి.

– పంతకాని సమ్మయ్య, మహదేవపూర్

**త్వరలో పునరుద్ధరిస్తాం..**



మహదేవపూర్ మండల కేంద్రంలోని టీజీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవలు నడిచేది. కొన్ని కారణాలతో సేవలు నిలిచిన మాట వాస్తవమే. ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కార్గో సేవల నిర్వహణకు రెండు నెలల క్రితం మండలం నుంచి ఇద్దరు వ్యక్తులు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని పరిశీలించి సత్వరమే సేవలను పునరుద్దరించేందుకు చర్యలు చేపడతాం.

– తిరుపతి , భూపాలపల్లి డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్

## ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకోవాలి

కృష్ణకాలనీ, డిసెంబర్ 28: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం వేషాలపల్లి, భాస్కర్‌గడ్డలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షించి, సౌకర్యాలను పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. ధాన్యం మిల్లులకు రవాణా చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, సహకార అధికారి వాలియా నాయక్, సిబ్బంది ఉన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

## మోటర్ వెహికిల్ చట్టంపై అవగాహన




మాట్లాడుతున్న మహేందర్

ములుగురూరల్, డిసెంబర్ 28 : ములుగు మండలంలోని జాకారం గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ పాల్గొని లారీ ఓనర్స్ అసోసియేషన్‌లోని లారీ డ్రైవర్స్, ఓనర్స్‌లకు మోటర్ వెహికిల్ చట్టంపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ తప్పక ఉండాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, డీఎల్‌ఎస్‌ఏ సిబ్బంది, లారీ ఓనర్స్, డ్రైవర్లు పాల్గొన్నారు.

## పేదల పక్షాన సీపీఐ పోరాటం

రేగొండ, డిసెంబర్ 28 : పేదల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మామిడాల సమ్మిరెడ్డి అన్నారు. పార్టీ శత వసంతోత్సవాల సందర్భంగా శనివారం ఆయన మండలకేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన నిరుపేదల భూమి, భుక్తి కోసం నేటి వరకూ నిరంతరం పార్టీ పోరాడుతూనే ఉంటుందన్నారు. నాయకులు చంద్రమౌళి, పైండ్ల శాంతికుమార్, చిగురుమామిడి మోహన్, కడారి భవాని, లలిత పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల అవస్థలు

వెంకటాపురం(నూగూరు), డిసెంబర్ 28 : రోడ్ల నిర్మాణం దారుణంగా ఉందని, అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. మండలంలోని కొండాపురం నుంచి 20 కుటుంబాలు పార్టీలో శనివారం చేరాయి. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ప్రజల కోసం అనునిత్యం ప్రజాపోరాటాలు నిర్వహించే పార్టీ పేదలకు ఎళ్లవేలలా అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు, మండల కమిటీ నాయకులు కట్ల నరిసింహచారి, చిట్టెం ఆదినారాయణ, రాంబాబు, కాపుల వెంకటేశ్వర్లు, బాణారి సమ్మయ్య, గణేశ్, శ్రీనివాస్‌రావు, రమేశ్, రాణి, ప్రభావతి, నగేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సారయ్య

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఏటూరునాగారం, డిసెంబర్ 28 : రిటైర్డు ఉద్యోగులు తమ పెన్షన్ సమస్యలు ఏమైనా ఉంటే అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాల్తియా సారయ్య పేర్కొన్నారు. మండలకేంద్రంలో 42వ జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సారయ్య మాట్లాడారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు సభ్యులంతా కృషి చేయాలని కోరారు. సంఘం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. సమస్యలు వస్తే వాటిని పరిష్కరించేందుకు జిల్లా సంఘం కృషి చేస్తుందన్నారు. సంఘం తరపున చేసే కార్యక్రమాలపై చర్చించారు. పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా వేడుకలు చేపట్టారు. అనంతరం మాజీ ప్రధాన మంత్రి చిత్రపటం వద్ద నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాసాని రామ్మూర్తి, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు చామర్తి రమేశ్, బానోతు సేవ్లానాయక్ పాల్గొన్నారు.



విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఇంటెలిజెన్స్ ఎస్పీ రమేశ్

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

వెంకటాపూర్, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఇంటెలిజెన్స్ ఎస్పీ డీ రమేశ్ అందజేశారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఎస్పీ రమేశ్ పూర్వ విద్యార్థులకు సుమారు రూ.15వేల విలువగల స్టడీ మెటీరియల్ అందజేసి మాట్లాడారు. విద్యార్థులు స్వీయ క్రమశిక్షణతో పట్టుదలగా చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధిక, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జరీనాబేగం, ఎస్సై సతీశ్, ఉపాధ్యాయులు జనగాం బాబురావు, అంబేద్కర్ మహేశ్, సంధ్య, కిశోర్, జగన్మోహన్ పాల్గొన్నారు.

## టీఆర్టీలకు ఉపాధ్యాయుల మద్దతు

ములుగురూరల్, డిసెంబర్ 28 : సమగ్ర శిక్ష అభియాన్, గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న సీఆర్టీ ఉద్యోగుల ధర్నాకు సంఘీభావంగా రాయినిగూడెం పాఠశాలలో ఉపాధ్యాయులు శనివారం మధ్యాహ్న భోజన సమయంలో మద్దతుగా నినాదాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరిక శ్రవణ్‌కుమార్, టీఎస్ ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూడ్ కసన్‌సింగ్, గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం ఓఆర్‌జీ సెక్రటరీ ఈరులాల్, ఉపాధ్యాయులు సంపత్, రాందాస్, సాంబయ్య, రాజు, కృష్ణమూర్తి, పరంసింగ్, గోపీసింగ్, రవీందర్, నారాయణ, వెంకటేశ్వర్లు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు